క్లుప్తంగా

నేడు గట్రాళ్లమిట్టలో గడప గడపకు మన ప్రభుత్వం

గుడిపాల: మండలంలోని గట్రాళ్లమిట్ట గ్రామంలో సోమవారం ఉదయం 6.30 నుంచి 2గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్ర తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పకుండా కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు

చిత్తూరు రూరల్: నగరంలోని చెరువు ముందర గ్రామంలో ఉన్న అడ్డగుట్ట వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో హరికథ కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

నాగాలమ్మ ఆలయంలో విశేష పూజలు



విశేషాలంకరణలో నాగాలమ్మ

చిత్తూరు రూరల్: నగరంలోని వెంగనపల్లెలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో ఆదివారం పౌర్ణమి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాలకంరణ చేసి, భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

రైతులకు అందుబాటులో యూరియా

గుడిపాల: రైతులకు అందుబాటులో యూరియా ఉన్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని పాపసముద్రం, వసంతాపురం రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉందన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకుని వరిపంట సాగు చేసిన రైతులకు మాత్రమే మొదటగా యూరియా ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తీసుకోవాలన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ సుజన, అధికారులు

పాలసముద్రం: రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పలు పంటలకు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని నగరి డివిజన్ ఆర్డీఓ సుజన తెలిపారు. ఆదివారం మండలంలోని ఏట్టుకూరిపల్లె, పాలసముద్రం పంచాయతీల్లో రైతులు సాగు చేసి పంటలను ఈ-క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేశారా? లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు, తహసీల్దార్ బాబు, ఏఓ ఢిల్లీప్రసాద్, వీఆర్వో తంగరాజ్, వ్యవసాయ సహాయకులు వనజ, వీఆర్‌ఏ మునస్వామి పాల్గొన్నారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ



మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారి వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలకు వచ్చే తెగుళ్లను కషాయాలతో నివారించవచ్చని చిత్తూరు ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురంలో జీవామృతం, కషాయం తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట సాగు చేసిన రైతులు సొంతంగా జీవామృతం, కషాయం తయారు చేసుకోవచ్చని తెలిపారు. దేశీయ ఆవుపేడ 10 కిలోలు, మూత్రం 10 లీటర్లు, నల్లబెల్లం 2 కిలోలు, పప్పు దినసపిండి 2 కిలోలు, పుట్టమట్టి కిలో 20 లీటర్ల నీటితో కలిపి, వారం రోజులు పులియపెట్టాలన్నారు. తరువాత ఆ కషాయాన్ని తెగుళ్ల నిరారణకు వాడాలని తెలిపారు. అనంతరం కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు.

వైభవంగా రుద్రాభిషేకం

పాలసముద్రం: మండలంలోని రాచపాళెంలో ఉన్న బాలగురునాధీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం భక్తులు తొమ్మిది బిందెల పాలు, తొమ్మిది బావుల్లోని నీటిని బిందెలు, పూజ సామగ్రి మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించారు.

పేదల సొంతింటి కల సాకారం చేశాం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీతోపాటు ఇళ్లు నిర్మించి, వారి సొంతింటి కల సాకారం చేశామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం గుడిపాల మండలంలోని మందికృష్ణాపురం, అనురాధకాలనీ, మందికృష్ణాపురం దళితవాడ, ఎస్టీకాలనీ, గురుగునత్తం, నంగమంగళం, వేలురాంబట్టి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై టీడీపీ నాయకులకు ఏ మాత్రం చిత్త శుద్ధి లేదన్నారు. వారి పాలనలో కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చిత్తూరు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా సమస్యలు పరిష్కరించిన పాపానాపోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు కావడంతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. అన్నివర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టామన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ఇంటి వద్దనే అందజేస్తున్నారని తెలిపారు. గతంలో జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉంటేనే పథకాలు అందేవని అవి కూడా తెలుగుదేశం నాయకులకే ఇచ్చేవారని, ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జనార్దన్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, జయకోడి, రజినీకాంత్, శ్రీధర్‌రెడ్డి, కారిమేఘన్, డానియల్, చిట్టబాబు, రవీంద్రారెడ్డి, కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, సాయి, శిలంబరసన్, సాయిప్రతాప్, జ్ఞానజగదీష్, వరదరాజులరెడ్డి, రవి, ప్రవీణ్, దయానందరెడ్డి, వాసు, రవియాదవ్, వెంకటేష్‌రెడ్డి, సుధాకర్ నాయుడు, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ ఉపేంద్ర, ఎంఈఓ రామ్‌నాయక్, ఏఈలు గణేష్, హిమంత్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు పెద్దపీట

చిత్తూరు కార్పొరేషన్: మైనారిటీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వక్ఫ్‌బోర్డు, మైనారిటీ సంఘం నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పనులపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ గఫ్ఫార్‌ఖాన్ మాట్లాడుతూ చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలకు కలిపి చిత్తూరుకు సమీపంలోని మురకంబట్టు వద్ద మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ ఒకటే ఉందన్నారు. ఆ పాఠశాల అభివృద్ధిని గురించి గత పాలకులు ఏ మాత్రం పట్టించుకోని దుస్థితి ఉందని తెలిపారు. 15 సంవత్సరాలుగా ఆ పాఠశాల అద్దె ప్రాంగణంలో నడుస్తోందన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించడం గొప్ప విషయమని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆ పాఠశాలలో చదువుతున్న ముస్లిం, క్రిస్టియన్, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన 200 మంది విద్యార్థులతోపాటు మరో 300 మందికి మేలు కలగనుందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అంజుమన్ కమిటీ అబ్దుల్‌గని, కో ఆప్షన్ సభ్యుడు ఆను, పాఠశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానిస్తున్న వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్, మైనారిటీ నాయకులు

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 0857 2232745, వాట్సప్- 98499 07885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంచనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలో స్పందన ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామని, తమ సమస్యలపై ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చన్ని ఆమె పేర్కొన్నారు.



విస్తారంగా వర్షాలు కురవడంతో రైతన్నలు అధికంగా వరిపంట సాగు చేశారు. గుడిపాల మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా వరి పైరు పచ్చగా కనిపిస్తోంది. గత కొద్దిరోజులుగా కూలీలు వరిలో కలుపుతీత పనిలో బిజీ, బిజీగా ఉన్నారు. -గుడిపాల

జోరుగా ఎడ్ల పందేలు

ఐరాల: మండలంలోని నయనంపల్లె, మొరపగుట్ట పల్లె గ్రామాల్లో ఆదివారం కోలాహలంగా ఎద్దుల పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. గోవులు, ఎద్దులను శుభ్రం చేయించి, కొమ్ములకు రంగులు వేశారు. పూలమాలలు, రంగు కాగితాలు, గిత్తల కొమ్ములకు వినూత్న తరహాలో పట్టీలు కట్టి, గాలి బుడగలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఎద్దులు, కోడెగిత్తలను పరుగులు తీయించారు. పట్టీల కోసం యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. పట్టీలను దక్కించుకున్న యువకులు విజయోత్సాహంతో కేరింతలు కొట్టారు. చాలాగిత్తలు చిక్కకుండా రంకేసి పరుగులు తీశాయి. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం హాజరు కావడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.



పట్టీ కోసం ఎగబడుతూ ఉన్న యువకులు

భగవద్గీత పఠనంతో జ్ఞానం


తవణంపల్లె: భగవద్గీత పఠనంతో జ్ఞానం లభిస్తుందని త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి సభ్యులు అన్నారు. ఆదివారం వారు మండలంలోని లక్ష్మీనారాయణపురంలో ఆదివారం సాయంత్రం త్రైతసిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని త్రైతసిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా తెలుసుకోగలరని సూచించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ధనంజయ, సభ్యులు పాల్గొన్నారు.



భగవద్గీత గురించి వివరిస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

వేడుకగా మాఘ పౌర్ణమి పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణిమి సందర్భంగా విశేష పూజలు నిర్విహించారు. ఉదయం లక్ష్మీనారాయణ హోమం, అభిషేకాలు నిర్యహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో హరికథా గానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో మహిళలు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

సీపీఎస్ రద్దు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: సీపీఎస్ రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో సంకల్పదీక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం



సారా విక్రేతను అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళెం మండలంలో ఆదివారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి, ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అదే మండలంలో సారా విక్రయిస్తున్న శ్రీనివాసులు (34)అనే వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు, కృష్ణవేణి, శ్వేత, మమత పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

గంగాధరనెల్లూరు: మండలంలోని దాసరాపల్లె ఎస్టీ కాలనీలోని 40 కుటుంబాలకు ఆదివారం సింధూర్ సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.2వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఇన్బనాథన్ చేతుల మీదుగా నిత్యావసరాలను అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం శుభపరిణామమన్నారు. ఎస్టీ కాలనీవాసులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, సింధూర్ సంస్థ అధ్యక్షుడు రవి, వైఎస్సార్ సీపీ నాయకుడు కేశవులు పాల్గొన్నారు.

యూనిఫామ్ వితరణ



క్రీడాకారులతో దాత

వెదురుకుప్పం: మండలంలోని రాకెట్‌బాల్ క్రీడాకారులు హేమాద్రిరెడ్డి, గజేంద్రరాజు, కుమార్‌కు బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్‌రెడ్డి ఆదివారం యూనిఫామ్ వితరణ చేశారు. ఇటీవల రాష్ట్ర జట్టు తరపున రాకెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన మండల క్రీడాకారులను ఆయన అభినందించారు. అలాగే ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనున్న రెండో సీనియర్ రాకెట్ బాల్ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఎస్.హేమాద్రిరెడ్డి, గజేంద్రరాజు, కుమార్, కే.హేమాద్రిరెడ్డి పాల్గొనున్నట్లు కోచ్ నాగభూషణం తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా చూడాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. గుడిపాల ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీఓ ఉపేంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల మీట్‌లో ప్రస్తావించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు సమాధానమిచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 27 పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సచివాలయాల నిర్మాణాలను కూడా వెంటనే చేపట్టాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు కావాల్సిన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డులు ఇకపై ఆరునెలలకొకసారి మాత్రమే ఇస్తామన్నారు. ప్రస్తుతం భూ రీసర్వే కార్యక్రమం జరుగుతుందని, ఎవరైనా సర్వే చేయించుకోవాలంటే దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే రైతులకు సంబంధించి భూములు సర్వే చేస్తామన్నారు. చిత్తూరు నుంచి చిత్తపారకు వెళ్లే ఆర్టీసీ బస్సు సరిగ్గా రావడం లేదని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చిత్తపార ఎంపీటీసీ సభ్యుడు గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌లు రజినీకాంత్, ప్రసాద్, జనార్దన్, గోపి, పెరిల్లా, మోహన్, జయకోడి, సునీలా, ఎంపీటీసీ సభ్యులు యోవాన్ బాలమ్మ పాల్గొన్నారు.

జాతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు రూరల్: జాతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో నేషనల్ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడానికి ఉద్దేశించిన గ్రామీణ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తే ఖాతాదారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, జాతీయ బ్యాంకులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు పీఎల్ ఆనంద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, హరి శశి, శ్రీనివాసరెడ్డి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

15 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



శ్రీమొగిలీశ్వరస్వామి, శ్రీకామాక్షమ్మ

బంగారుపాళెం: మండలంలో దక్షిణకాశిగా పేరొంది స్వయంభుగా వెలసిన శ్రీ కామాక్షి సమ్మేత శ్రీమొగిలీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మొగిలి గ్రామంలో ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 25 వరకు 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి మునిరాజ, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ ఆదివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 15న ఉదయం అంకురార్పణ, రాత్రి మూషిక వాహనం సేవ ఉంటుందన్నారు. 16న ఉదయం కలశస్థాపన, ధ్వజా రోహణం, రాత్రి హంసవాహనం, 17న ఉదయం అధికార నందివాహనం, రాత్రి సింహవాహన సేవ, అలాగే 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, రాత్రి లింగోద్భవ అభిషేకం, వృషభ వాహన సేవలు ఉంటాయని చెప్పారు. 19న ఉదయం కైలాసగిరి రావణబ్రహ్మ వాహన సేవ, రాత్రి శేషవాహనం, 20న ఉదయం అభిషేకం, గజవాహనం, రాత్రి కామధేను వాహనం, 21న ఉదయం అభిషేకం, సాయంత్రం కళ్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిస్తారన్నారు. 22న ఉదయాత్పూర్వం తోపుఉత్సవం, అభిషేకం, మధ్యాహ్నం బ్రహ్మ రథోత్సవం, 23న ఉదయం అభిషేకం, రాత్రి పుష్పపల్లకి సేవ, 24న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజా అవరోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, శయనోత్సవం, 25వ తేదీ సాయంత్రం అభిషేకం, రాత్రి తెపోత్సవ కార్యక్రమాలను కనులవిందుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పరమశివుని బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో వెలసిన శ్రీదేవి, పెరుందేవి సమేత వరదరాజుల స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణ స్వామి అలంకరణలో వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై వ్రతం ఆచరించారు. రాత్రి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం నుంచి భక్తులు స్వామివారి దర్శనార్థం పెద్దసంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయి బయటవరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశ్ చర్యలు చేపట్టారు. అలాగే గర్భిణులకు, చంటిబిడ్డ తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

వినాయకుని సేవలో కలెక్టర్



కలెక్టర్ హరినారాయణన్

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని జిల్లా కలెక్టర్ హరినారాయణ ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్ వీరాంజనేయస్వామికి అర్చకులు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చందనం అలంకరణలో వీరాంజనేయ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పలురాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం

పౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆలయంలో అర్చకులు సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా కలశపూజ చేపట్టి, అనంతరం వేదమంత్రాలను పఠిస్తూ హోమం జరిపించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్ర రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు.



హోమంలో ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి